ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 25 జూన్, 2024 | పేజీలు : 04


## ప్రజావాణి సమస్యలను పెండింగ్‌లో పెట్టవద్దు



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే సమస్యలను సత్వరమే అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ధరఖాస్తులపై నిర్లక్ష్యంగా

తరువాయి 3లో

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సీజనల్ వ్యాధులను నియంత్రణపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సంధర్భంగా వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో శానిటేషన ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. దోమల వ్యాప్తిని నివారించాలని, మురికి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. ప్రజలు ఇండ్ల వద్ద పరిశుభ్రత పాటించాలని, బయట ఆహారం తీసుకోవద్దని తెలిపారు. వర్షాకాలంలో తాజా కూరగాయలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఎక్కడపడితే అక్కడ నీటిని తాగవద్దని సూచించారు. పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్‌ను అందుబాటులో ఉంచాలని, విధ్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. డెంగీ, మలేరియా, విష జ్వరాలు ప్రబలకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వాహకులు వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందికి కాకుండా ఏజెన్సీ వారికి అప్పగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, డిపివో రవీందర్, జడ్పి సీఈవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి కలెక్టర్

ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో డిస్టిక్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లపై చర్చించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులకు నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. అన్నీ నిర్ధారించుకున్న తర్వాతనే రిజిస్ట్రేషన్ అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. పెండింగ్‌లో పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రామ్ కిరణ్, కార్యదర్శి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ మంచిర్యాల :** అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. సోమవారం అంగన్‌వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం 26 వేలు, హెల్పర్లకు 21 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్స్ కు 2 లక్షలు రూపాయలు, హెల్పర్లకు లక్ష రూపాయలు ఇస్తామని గత ప్రభుత్వం సమ్మె కాలంలో ప్రకటించిందని గుర్తు చేశారు. టీచర్లకు లక్ష రూపాయలు హెల్పర్లకు 50 వేలు ఇస్తానని జిఓ రిలీజ్ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఖలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, కృప, పద్మ, రాజవ్వ, స్వర్ణలత, విజయ, ఏసుమని, అనసూయ, శిరీష, వసుందరలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు జీవన్‌రెడ్డి



ప్రోటోకాల్ పరంగా గౌరవం కల్పిస్తాం
ఎమ్మెల్సీకి మంత్రి శ్రీధర్ బాబు హామీ
గంటన్నర పాటు చర్చలు

**ప్రజాపక్షం జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరడం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టించాయి.ఎమ్మెల్సి జీవన్ రెడ్డికి సమాచారం ఇవ్వకుండానే ఎమ్మెల్యేను చేర్చుకోవడంతో గుర్రుగా ఉన్న పెద్దాయన ఎమ్మెల్సీకి రాజీనామా చేస్తానని ప్రకటించడం కాంగ్రెస్ పార్టీలో పెద్ద దుమారం లేపింది.విషయం తెకుసుకున్న కాంగ్రెస్ అధిష్టానం మొదట ప్రభుత్వ విప్ లు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, అది శ్రీనివాస్ లు జీవన్ రెడ్డి ఇంటికి చేరుకుని బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినను నిర్ణయంలో మార్పు లేదనడం, కార్యకర్తలు సైతం పార్టీ నిర్ణయం తప్పుదన్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను సీఎం ప్రభుత్వ ధూతగా బుజ్జగించడానికి వెళ్లాలని చెప్పడం విషయం కార్యకర్తలకు తెలియడంతో ప్రభాకర్ జగిత్యాల కు వస్తే అడ్డుకు0తామని చెప్పడం వెంటనే ఐటి మంత్రి శ్రీధర్ బాబును రంగంలోకి దింపింది.శ్రీధర్ బాబు జగిత్యాలకు చేరుకుని లక్ష్మ ణ్ కుమార్, అది శ్రీనివాస్ లతో కలిసి జీవన్ రెడ్డి తో గంటన్నర పాటు చర్చలు జరిపారు.జీవన్ రెడ్డి పెద్దాయన కష్ట కాలంలో కాంగ్రెస్ కు పెద్ద దిక్కుగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశారని ,ఆయనకు ప్రోటోకాల్ పరంగా సముచిత గౌరవం కల్పిస్తామని శ్రీధర్ బాబు చెప్పారు.

అధిష్టానంతో మాట్లాడి జీవన్ రెడ్డిని పార్టీ అన్నివిధాల న్యాయం చేస్తుందని చెప్పారు. కార్యకర్తల అభిప్రాయం మేరకే నడుచుకుంటానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.

# సకాలంలో సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఖరీఫ్ 2023 24, రబీ 202324 సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ నిర్దేశించిన గడువులోగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సంభందిత అధికారులతో సి.ఎం.ఆర్. రైస్ డెలివరీపై, రేషన్ బియ్యం అక్రమ తరలింపు, నిల్వల నివారణకు తీసుకోవల్సిన చర్యలపై సమీక్షించారు.ఖరీఫ్ 2023 24 సీజన్ లో పెద్దపల్లి జిల్లాలో ఉన్న రైస్ మిల్లులకు లక్షా 29 వేల 199.95 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 42 శాతం అనగా 54 వేల 416.48 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయడం జరిగిందని, భారత ఆహార సంస్థలు నిర్దేశించిన లక్ష్యంలో 99 శాతం బాయిల్డ్ రైస్, 32 శాతం రా రైస్, పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్ కు 84 శాతం మేర బ్రోకెన్ రైస్ డెలివరీ పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. రబీ 202324 సీజన్ లో పెద్దపల్లి జిల్లాలో ఉన్న రైస్ మిల్లులకు 2 లక్షల 81 వేల 506 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 12 శాతం అనగా 33 వేల 89 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయడం జరిగిందని, భారత ఆహార సంస్థలు నిర్దేశించిన లక్ష్యంలో 59 శాతం బాయిల్డ్ రైస్ డెలివరీ పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. రా రైస్ డెలివరీలో రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర పని చేసి సీఎంఆర్ రైస్ డెలివరీ వేగవంతం చేయాలని, మిల్లుల వారీగా డైలీ రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై గట్టి నిఘా



ఏర్పాటు చేయాలని, అక్రమ రేషన్ బియ్యం రవాణా, నిల్వలను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించా లని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ప్రేమ్ కుమార్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డి.టి. సి.ఎస్., తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



**ప్రజాపక్షం/చందుర్తి:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పార్టీ మారడాన్ని నిరసిస్తూ చందుర్తి మండల కేంద్రంలో సోమవారం బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మేకల ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆయన దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం దురదృష్టకరమని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన నాయకులు ప్రస్తుత తరుణంలో పార్టీకి అండగా ఉండాల్సింది. పోయి స్వప్రయోజనాల కోసం పార్టీ మారడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నీచ రాజకీయాలు మానుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల శ్రేణులు పాల్గొన్నారు.

## ఎంపిపి, ఎంపిటిసిలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి జాజాల భీమేశ్వరీ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపిపి, ఎంపిటిసిల పదవీ కాలం మరికొద్ది రోజుల్లో పూర్తి అవుతుండడంతో ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. పదవీ అయిపోయినా కూడా ప్రజలకు సేవా చేయడానికి ఎన్నో మార్గాలు ఉంటాయని సూచించారు. అనంతరం ఎంపిపి, ఎంపిటిసిలను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శాలువాతో సన్మానించి, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఆయా గ్రామాల ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

## నాణ్యమైన బోజనం అందించాలే...



**ప్రజాపక్షం/మంథని:** ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందే రోగులకు రుచికరమైన నాణ్యమైన బోజనం అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెంట్రి రమాసురేష్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె సందర్శించి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు అందించే బోజనం, ఇతరత్రా సదుపాయాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి పేదలే వస్తారని, అలాంటి వారికి మంచి బోజనం, మంచి వైద్యం అందించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు, సదుపాయాల కల్పనపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నారని, అలాగే మంత్రి సహకారంతో ఇక్కడి పేదలకు మంచి వైద్యం అందేలా చూస్తామని ఆమె స్పష్టం చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ నక్క నాగేంద్ర శంకర్‌తో పాటు వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## నేడు రైతు నేస్తం సదస్సులు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** వానాకాలం సీజన్లో పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై జిల్లాలోని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనలు అందిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట, వేములవాడ పరిధిలోని హన్మాజీపేట రైతు వేదికల్లో ఉదయం 10 గంటల నుంచి 11:10 గంటల దాకా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వానాకాలంలో విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తలు సలహాలు అందిస్తారని వివరించారు. జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సౌదీ అరేబియాలో గుండెపోటుతో ఎర్దండి వాసి మృతి

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన పోతన్న ఈ నెల జూన్ 11న గుండెపోటుతో మృతి చెందాడు. సౌదీ అరేబియా రియాద్ ప్రాంతంలో హౌస్ డ్రైవర్‌గా మూడు నెలల క్రితం విజిట్ వీసా పై వెళ్లాడు. మృతునికి భార్య లక్ష్మి, ముగ్గురు బిడ్డలు రవళి, రచన, రుచిత ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి: ఎబివిపి,ఎస్.ఎఫ్.ఐ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు చేపట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఏబీవీపీ ఇందూర్ విభాగ్,ఎస్.ఎఫ్.ఎస్ కన్వీనర్ చంద్రగిరి,శివ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న ప్రైవేట్ స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.నిర్మల్ జిల్లా లో విచ్చలవిడిగా పుస్తకాలను అమ్ముతున్నారు.మధ్యతరగతి విద్యార్థులు పుస్తకాలు కొనలేకా ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు అదే విధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అధిక ధరలకు అమ్ముతున్న ప్రైవేట్ పాఠశాలాలు,పాఠశాల ఫీస్‌లు అధికంగా వసూలు చేయడం జరుగుతుందని,అక్రమంగా పాఠశాలలో నే ఒక గదిలో పెట్టి పుస్తకాలను అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులు నుండి అధిక ధరలకు అమ్ముతున్న యాజమాన్యం అదే విధంగా ఈ ఒక్క ప్రైవేటు దందా పై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయటం జరుగుతుంది.ప్రైవేట్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఎబివిపి డిమాండ్ చేస్తుందని,లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్,జశ్వంత్,లక్ష్మ ణ్,గణేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం..

**ప్రజాపక్షం/మెట్ పల్లి :** జగిత్యాల నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన టికెట్ పై గెలుపొందిన డాక్టర్ సంజయ్ కుమార్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎంపీపీ మారు సాయి రెడ్డి అన్నారు. పట్టణంలో పాత బస్టాండ్ శాస్త్రీ చౌరస్తా వద్ద, సోమవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. బిఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ సిద్ధాంతాలను నచ్చి జగిత్యాల నియోజకవర్గ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి మూడు సార్లు ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ను గెలిపించారు. మొన్న రాత్రికి రాత్రే బిఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన టికెట్ పై పోటి చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో మాల్లాపూర్ మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు పీసు తిరుపతి, కాట శ్రీధర్, ఆరెళ్ల రాజగౌడ్, బద్దం శేఖర్, కోరెపు రవి, మాజీ ఎంపిటిసి నోముల గంగాధర్, కౌన్సిలర్ బంగారు కళ్ల కిషోర్, వెంకటేష్, శ్యామ్ ప్రసాద్, భూమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల స్పెషల్ ఎవర్నెస్ క్యాంపెయిన్

**ప్రజాపక్షం / జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా మహిళా సాధికారత బృందం వారు, 100 రోజుల స్పెషల్ ఎవర్నెస్ క్యాంపెయిన్ లో భాగంగా మాతా శిశు ఆసుపత్రిలో అక్కడ ఉన్న ఆశా వర్కర్స్ కి మరియు గర్భిణి స్త్రీలకి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అక్కడ ఉన్న వారికి పి.సి & పి.ఎన్.ది.టి యాక్ట్ గురించి వివరించడం జరిగింది. లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి వారికి తెలయజేయడం మరియు ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యత గురించి చెప్పడం జరిగింది. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారు అందించే సేవలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, మహిళా సాధికారత కేంద్రం టీమ్ కె ఆశ్విని, డిస్టిక్ కో ఆర్డినేటర్ గౌతమి, స్వప్న(జెండర్ స్పెషలిస్ట్), హేమా శ్రీ(స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షియల్ లిటరసీ) పాల్గొన్నారు.

## అవినీతి అధికారి సిడిపిఓ సరిత ను తొలగించాలి




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** అంగన్వాడి సెంటర్ల నుండి ప్రతినెల డబ్బులు వసూలు చేస్తూ,డబ్బులు ఇవ్వని వారిని అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతూ భార్య భర్తల మధ్య వివాదాల సృష్టిస్తున్న సిడిపిఓ పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బొమ్మన సురేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం క్రితమే అవినీతి పద్ధతులు మార్చుకోవాలని,సిడిపిఓ కు తొత్తులుగా ఉన్న కొంత మంది అంగన్వాడి టీచర్లకు కూడా హెచ్చరికలు జారీ చేశామని,అయినా పద్ధతులు మార్చుకపోవడం,మరింత డబ్బుల కోసం సెక్టర్ లీడర్స్ తో పాతటు అంగన్వాడి సూపర్వైజర్లతో ఆదేశాలు జారీ చేస్తూ,మిగతా అంగన్వాడి టీచర్ లను ఇబ్బంది పెడుతూ,సెక్టర్ లీడరుగా ఉండి మిగతా టీచర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్న వంటి అంగన్వాడీ టీచర్లను గుర్తించి వాళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నమన్నారు.గతంలో ఈ సిడిపిఓ సరిత సంవత్సరానికి రెండుసార్లు గుడ్లను సెంటర్లకు పంపకుండా అమ్మి వేసినటు వంటి సంఘటనలు ఆధారాలుగా ఉన్నాయి.సిడిపిఓ సరిత పై విచారణ చేపట్టి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరారు.సిడిపివో చేస్తున్న అవినీతి అక్రమాలపై ప్రజాపక్షం దినపత్రికలో నిర్మల్ జిల్లా ప్రతినిధి రాసిన వార్త కథనాలు వందకు వందశాతం నిజాలు నిర్భయంగా రాస్తున్నారని అలాంటి వారిపై సిడిపిఓ కావాలని అంగన్వాడి టీచర్లకు పిలిపించి ఖానాపూర్ లో ర్యాలీ తీయించడం,అది కూడా ఐసిడిఎస్ జిల్లా అధికారికి సమాచారం లేకుండా ఆ సిడిపీఓ ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుందని వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.వాస్తవాలను కప్పిపుచ్చేందుకే ప్రతిక విలేకరులకు అంగన్వాడి టీచర్లకు అక్రమ సంబంధాలు అంట కడుతూ భార్యభర్తల మధ్య చిచ్చు పెడుతూ సంబంధాలను తొలగిస్తుందని,అలాంటి అధికారి శిశు సంక్షేమ శాఖలో పనిచేయడం.ఆ శాఖకు తీరని మచ్చలా మిగులుతుందన్నారు.నెలకు అంగన్వాడీ టీచర్,ఆయల నుండి వెయ్యి రూపాయలు వసూలు చేస్తూ,బూతులు తిడుతున్న సిడిపిఓఐ క్రిమినల్ కేసు పెట్టాలన్నారు.ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే.రాధ,జిల్లా కమిటీ సభ్యులు జి .లక్ష్మి,అంగన్వాడి టీచర్ రాణి తదితరులున్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన శోభ...

**ప్రజాపక్షం/మంథని:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన శోభ సంతరించుకుంటుందని మున్సిపల్ చైర్ పర్సన్ పెంట్రి రమా సురేష్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణా కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగాఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇందులో బాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో 36సంవత్సరాల్లోపు పిల్లలకు ప్రాథమిక విద్య అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రతి అంగన్‌వాడీ టీచర్ చిన్నారులపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని, ఆటాపాటలతో పాటు మంచి బోధన చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రణాళికతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, వైస్ చైర్మన్ సీపతి బానయ్య, సీడీపీఓ స్వరూప, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్‌లో మంగళవారం నుంచి జరగబోయే ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్‌లు పిలుపునిచ్చారు. ఈ నెల 25, 26,27 తేదీల్లో కరీంనగర్‌లోని పెద్దపల్లి బైపాస్‌లో గల ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధ్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తూ విధ్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్రంలోని బిజెపి జాతీయ నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చి విద్యను కార్పోరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి ఈ జాతీయ నూతన విద్యావిధానం తీసుకొచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన హామీల్లో తెలంగాణకు రావాల్సిన నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐటి, ఐఎంఎం లాంటి అనేక విద్యాసంస్థలు తెలంగాణకు కేటాయించకుండా విధ్యార్థుల పట్ల నరేంద్ర మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవకతవకలు జరిగాయని దేశమంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరవకుముందే దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజిసి ఎన్ఏటి యుజిసి నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విధ్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్, యుజిసి, ఎన్ఏటి పరీక్షలో జరిగిన అవతకవలపై సుప్రీం కోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలన్నారు. ( జిల్లాస్థాయి అధికారులు కనీసం స్పందించకపోవడంతో విధ్యార్థుల తల్లి దండ్రుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులలో ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధ్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు విద్యార్థి కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.

## ప్రజావాణి సమస్యలను పెండింగ్‌లో పెట్టవద్దు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించవద్దని, పెండింగ్‌లో పెట్టకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 312 ధరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయానికి సంబంధించిన ధరఖాస్తులు 47, డిపివో కార్యాలయానికి 25, డీఈవో కార్యాలయానికి 14, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 11, కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 14, కరీంనగర్ రూరల్ తహసీల్దార్‌కు 24, గంగాధర 10, తిమ్మాపూర్ 10, మానకొండూర్ 10, వారధి సొసైటీకి 13 ధరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్‌తో పాటు అధికారులు ధరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కె.మహేశ్వర్, రమేష్ బాబు, తదతరులున్నారు.

జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం కలెక్టర్

అందరం కలిసి కరీంనగర్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అధికారులంతా జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. సమన్వయంతో అందరం పనిచేయడం వల్ల పని ఒత్తిడి తగ్గుతుందని సూచించారు. సమస్యల పరిష్కారంతో పాటు జిల్లాను అభివృద్ధిలో ముందుముందు ఉంచేందుకు అందరం శ్రమిద్దామని పేర్కొన్నారు. అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.

## పాన్ కార్డుతో ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు తమపాన్ కార్డుతో ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజి సైదా కోరారు. ఈ నెల 30వ తేదీ నాటికి చివరి అవకాశం ఐటి డిపార్ట్‌మెంట్ కల్పించిందని పేర్కొన్నారు. పాన్‌కార్డుతో ఆధార్‌కార్డు అనుసంధానం లేని కార్మికులందరూ ఈనెల 30వ తేదీలోపు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. లేని యెడల ప్రతీ కార్మికుడి వార్షిక ఆదాయం నుండి 20 శాతం వరకు ఫెనాల్టి విధించే అవకాశం ఉందని తెలిపారు.

దీనివల్ల ప్రతీ కార్మికుడికి దాదాపు 1.50.000 పెనాల్టితో పాటు భవిష్యత్తులో ఇన్‌కం టాక్స్ రిటర్న్స్, బ్యాంకు రుణాలు, పాస్‌పోర్ట్ తీసుకోవడానికి అనుమతించరని, గడువులోగా పాన్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తెలిపారు.

## రేకుర్తిలో మూడు ఇళ్లలో చోరీలు



**ప్రజాపక్షం/కొత్తపల్లిః** కొత్తపల్లి మండలం రేకుర్తిలోని కాళోజీ నగర్‌లో గల అక్షయ హోమ్స్ పోచమ్మ వాడల్లో చోరీలు జరిగిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం రేకుర్తిలోని కాళోజీనగర్‌లో గల అక్షయ హోమ్స్ పోచమ్మ వాడలో గల తాళం వేసి ఉన్న మూడు ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఈ చోరీలకు పాల్పడ్డారు. ఈ సంఘటనల్లో జమున ఇంట్లో రూ.1.85 లక్షలు, తిరుపతి ఇంట్లో రూ.1.08 లక్షలు, రాజేందర్ ఇంట్లో రూ.95 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు నగదు దొంగిలించబడ్డాయి. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గస్తీని ముమ్మరం చేస్తామని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

## పబ్లిసిటీ కోసమే మంత్రిపై కౌశిక్ రెడ్డి ఆరోపణలు



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ సోమవారం హుజరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఉద్యోగాల పేరా, ఇసుక మాఫియా, రైస్ మిల్లర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారని, దానికి సంబంధించిన పూర్తి ఆధారాలతో మంగళవారం ఉదయం 11 గంటలకు హుజురాబాద్ నియోజకవర్గంలోని చెల్పూర్ ఆంజనేయస్వామి వద్దకు వస్తున్నామని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కూడా డబ్బులు తీసుకోలేదని వచ్చి ప్రమాణం చేయాలని ప్రణవ్ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## విద్యను వ్యాపారం చేయొద్దు



**ప్రజాపక్షం/జమ్మికుంటః** ఫీజుల దోపిడీతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోకుండా ప్రోత్సహిస్తోందని బిజెపి ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ అన్నారు. జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేయాలని ఆదేశాలున్నప్పటికీ అధికారులు మామూళ్లకు కక్కుర్తి పడి కన్నెత్తి చూడడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు వసూళ్లపై, సెంట్రల్ సిలబస్ పేరుతో ఫీజుల దోపిడీ వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విధానాలలో మార్పు రావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యను వ్యాపారంగా చేశారని మండిపడ్డారు. వెంటనే స్పందించి ప్రైవేట్ పాఠశాల ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, లేని పక్షంలో మండలంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బిజెపి ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి దొంతుల రాజకుమార్, బిజెవైఎం జిల్లా అధికార ప్రతినిధి కైలాస కోటి గణేష్, దేవులపల్లి నవీన్ తదితరులున్నారు.

## యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఆకుల ఉదయ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల ఉదయ్‌ను నియమిస్తూ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పడాల రాహుల్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. నగరంలోని 7వ డివిజన్ కార్పోరేటర్ ఆకుల లత ప్రకాష్‌ల కుమారుడైన ఉదయ్ కాంగ్రెస్‌లో యువత పట్ల ఉన్న ప్రాధాన్యత, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, యువతకు విద్యా ఉపాధి రంగాల్లో కల్పిస్తున్న అవకాశాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ యువత సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యత పట్ల సంపూర్ణ విధేయతను విశ్వసనీయతను చాటుకుంటానని ఉదయ్ పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, మానకొండూర ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్య, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గార్డియన్ స్కూల్‌లో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/జమ్మికుంటః** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో సాహితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియన్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మండల విధ్యాధికారి విడపు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా పాఠశాలకు హాజరైన 100 మంది విధ్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ డబ్బు లేనిదే అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేని నేటి సమాజంలో తక్కువ ఫీజుతో విధ్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తూ సమాజ సేవ చేస్తున్న గార్డియన్ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఆఫీసు పరంగా ఎటువంటి సహకారాలైనా పాఠశాలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మొదటిసారిగా విచ్చేసిన ఎంఈవో ను ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మహమ్మద్ అంకూస్ శాలువాతో సత్కరించారు.

## తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుని మృతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామానికి చెందిన బత్తిని సత్తయ్యగౌడ్ సోమవారం తాడిచెట్టు పై నుంచి కిందపడి మృతి చెందడం పట్ల సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో ప్రతి రోజు ఒక గీత కార్మికుడికి గాయాలు అవుతున్నాయని, అనేక ఇబ్బందులు పడుతున్నారని గీత కార్మికుల జీవనం దినదిన గండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన బత్తిని సత్తయ్య గౌడ్ కుటుంబం చాలా పేద కుటుంబమని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం గీత కార్మికులకు వెంటనే సేఫ్టీ మోకులు అందిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయన తెలిపారు. వెంటనే సత్తయ్య గౌడ్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాల్లో 'అల్ఫోర్స్' సంచలనం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాలలో అల్ఫోర్స్ విధ్యార్థులు అద్భుత మార్కులతో అఖండ విజయం సాధించారు. బైపిసి విభాగంలో జె.అంజన 440 మార్కులకు గాను 439 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎం.పి.సి విభాగంలో 30 మంది విధ్యార్థులు 470 మార్కులకు గాను 468 మార్కులతో చారిత్రాత్మక విజయం సాధించారు. అంతే కాకుండా 81 మంది విధ్యార్థులు 467 మార్కులు, 131 మంది విధ్యార్థులు 466 మార్కులతో సంచలనం సృష్టించారు. అనేక మంది విధ్యార్థులు 465 మార్కులు సాధించడం విశేషం. బైపిసి విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులు సాధించడంతో పాటు నలుగురు విధ్యార్థులు 438 మార్కులు, 14 మంది విధ్యార్థులు 437 మార్కులు, 34 మంది విధ్యార్థులు 436 మార్కులు సాధించారు. ఎంఈసి విభాగంలో టి.అఖిల్, వి.రిషిత, యం. శ్రీవల్లికా పటేల్ 500 మార్కులకు గాను 494 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానంలో నిలిచారు. సిఈసి విభాగంలో బి.గ్రీష్మ, సిహెచ్.నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానంలో నిలిచారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని తెలియజేశారు. ఇంతటి విజయానికి తోడ్పడిన అల్ఫోర్స్ అధ్యాపక , అధ్యాపకేతర బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సింగరేణి భవిష్యత్తును అంధకారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సంస్థకు దక్కాల్సిన బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటుపరం చేస్తూ సింగరేణిని అంధకార మయంలో చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో అతి ముఖ్యమైన సంస్థ సింగరేణి అని సంస్థ అభివృద్ధి కోసం కొత్త గనులు రావాలని పేర్కొన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తుందని




ఆరోపించారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సింగరేణి గనులను సంస్థకు కేటాయించేలా చూడాలన్నారు. గనులను సింగరేణికి కేటాయించేలాగా సిఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం పాట వేయకుండా నేరుగా ప్రభుత్వ రంగ సంస్థయైన సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కలవేన శ్యామ్, జాతీయ సమితి సభ్యులు భీంరావు, ఉప ప్రధాన కార్యదర్శులు గరిగే స్వామి, ల్యాగల శ్రీనివాస్, పేరం రమేష్, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జి తిరుపతి రాజ్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భీమ్, రవి, ఛీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరి చంద్రమోహన్, వెంకట స్వామి పాల్గొన్నారు.

## హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పచ్చునూరు హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ వివిఎస్ జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని తరగతులను తిరిగి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంపిణీ చేసిన చేయబడిన టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి అకాడమిక్ పరంగా చేయాల్సిన విధి విధానాలను తెలిపారు. కార్యక్రమంలో డిఓతో పాటు డిఈవో, అకాడమిక్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.షీలా ఉపాధ్యాయ బృందం, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రక్షక భటులకు నూతన భవనాలను నిర్మించాలి

ప్రజాపక్షం/శంకరపట్నం: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లోని విధులు నిర్వహిస్తున్న రక్షక భటులకు నూతన భవనాలను నిర్మించాలని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణేష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రక్షక భటులకు నూతన భవనాలను నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మండల కేంద్రంలోని రక్షకభటులకు నూతన పక్క భవనాలను నిర్మించాలని కోరారు.

## అంధకారంలో బస్టాండ్...



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ మండలం ఐన కొత్తబస్టాండ్‌లో కరెంట్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అసలే మహిళలకు ఉచితబస్సు ప్రయాణం అటుగా చోరికి అవకాశంగా మారుతున్న ప్రాంగణం అందకారంలో మునిగిపోవడంతో మహిళలు విద్యార్థులు ఇక్కట్ల పాలగుతున్నారు.మలమూత్రశాలలు కూడా పనిచేయ కుండా ఉండటంతో అసహనంతో ఉన్నారు.ఇప్పటికైన అధికారులు చర్యలు చేపట్టాలని సిరిసిల్లా ఆర్టీసీ డిపో,కరీంనగర్ రిజనల్ మేనేజర్ బస్టాండ్ పట్ల ప్రయాణికుల వసతుల పట్ల పనులు చేపట్టి బస్టాండ్‌లో కరెంట్ ఉండేటట్లుగా చేయాలని కోరుతున్నారు.గత కొన్ని రోజులుగా బస్టాండ్‌లో దుకాణ సముదాయం తీసుకున్న టెండర్ ముగియడంతో బస్టాండ్ వెలవెలబోతుంది.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ పాఠశాలలో విద్యాబోధన




ప్రజాపక్షం /నస్పూర్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతూ ధనార్జనే ధ్యేయంగా మంచిర్యాల జిల్లా పరిధిలోని కార్పొరేట్ పాఠశాలలు విద్యా బోధన చేస్తున్నాయని తెలంగాణ బహుజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం శ్రీ చైతన్య, నారాయణ, అభ్యాస, గ్రీన్ వుడ్, ట్రినిటీ కార్పొరేట్ పాఠశాలల లోని విద్యా బోధన గురించి జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముద్రించినటువంటి పాఠ్యపుస్తకాల లోని పాఠాలను విద్యార్థులకు బోధించకుండా, నిబంధనలకు విరుద్ధంగా ర్యాంకులు రావాలనే ఉద్దేశ్యంతో సొంత సిలబస్‌ను బోధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో తెలుగు, హిందీలతో ఆరు సబ్జెక్టులు చెప్పకుండా కేవలం మ్యాస్, సైన్స్ లకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల మేధస్సును అయోమయంలో పడేస్తున్నారని అన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు సేల్స్ టాక్స్ కట్టకుండా టై, బెల్ట్, షూ, సాక్సులు, డ్రెస్సులు, బుక్స్ అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కావున వీట న్నింటి పైన విచారణ చేపట్టి, నిబంధనకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలల పైన చర్యలు తీసుకొని గుర్తింపును రద్దు చేయాలని విద్యశాఖ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేముల కిరణ్, జిల్లా నాయకులు సాయికుమార్ పాల్గొన్నారు.

## నూతన ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్తు




ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సంస్థలో పనిచేస్తున్న నూతన ఉద్యోగుల పైన సింగరేణి సంస్థ మనుగడ, భవిష్యత్తు ఆధారపడి ఉందని ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఏరియాలో కారుణ్య నియామకాలు పొందిన 102 మంది యువతీ, యువకులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ కారుణ్య నియామకాలను చేపడుతూ ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని కొనియాడారు. సింగరేణిలో రెండవ తరానికి ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగం రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించడానికి కృషి చేయాలని చెప్పారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా, ఎస్ఓటు జిఎం వి. పురుషోత్తం రెడ్డి, డిజిఎం పర్సనల్ పి. అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పిఒ పి. కాంతారావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## అనుమానంతో అవమానిస్తున్నారు..



ప్రజాపక్షం/ ఖానాపూర్ రూరల్: నిర్మల్ జిల్లా, ఖానాపూర్ ఐసిడిఎస్ సిడిపిఓ అధికారిపై,అక్రమాల ఆరోపణల నేపథ్యంలో,గతంలో పలు పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో,సిడిపిఓ,పెంబి మండలానికి చెందిన రాణి అనే అంగన్వాడీ కార్యకర్త పై అనుమానంతో,అవమానిస్తున్నారంటూ,ఆమె ఆదివారం ఖానాపూర్ లో విలేఖరుల ముందు మనోవేదన వ్యక్తం చేశారు.గత కొన్ని నెలలుగా అధికారిని తనను టార్గెట్ చేస్తూ,కొంత మంది స్థానిక అంగన్వాడీ కార్యకర్తల మద్దతుతో,డబ్బులు కావాలని, ఫోన్ పే చేయమంటూ,వచ్చిన బిల్లులో రూ 1000 తనకు ఇవ్వాలంటూ వేధిస్తూ,అవమానిస్తుందని,ఆమె ఆరోపించారు.ఇటీవల తన గ్రామంలో నూతన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభిస్తానని,అధికారిని కొరగా రూ.5000 ఇస్తే ప్రారంభిస్తానని,లేకపోతే లేదని,వేధించారని ఆమె ప్రతికా ముఖంగా తెలిపారు.ఇది ఇలా ఉండగా స్త్రీ శిశు సంక్షేమ మహిళా అధికారిగా ఉండి, తనపై పూర్తిగా అవాస్తవ నిందలు వేస్తూ,విలేకరులతో అక్రమ సంబంధం అంటగట్టి,ప్రచారం చేస్తూ,చెప్పరాని భూతులతో,నిందిస్తున్నారని,దీనంతటికీ కారణం సిడిపిఓ అధికారి అని,చెడ్డ మాటలతో తనను అందరి ముందు ఇష్టం వచ్చినట్లు తిడుతుందని శనివారం రోజున ప్రజాపక్షం ప్రతికలో వచ్చిన అవినీతి తిమింగలం అనే వార్తకు,ఆమె ర్యాలీ తీసి,తాసిల్దార్ కార్యాలయం వద్ద తనను అందరి ముందు టార్గెట్ చేస్తూ,అవమానించారని ఆమె విలేకరుల ముందు గోడు వెల్లబోసుకున్నారు.మనోవేదనకు గురవుతున్న నేను,తనకు ఏమి జరిగినా సిడిపిఓ సరిత,స్థానికంగా ఉన్న కొందరు సిబ్బంది కారణం అని,ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు.సమావేశంలో ఆమెతో పాటు ఆమె భర్త కూడా పాల్గొన్నారు

## వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం /ఆసిఫాబాద్ : విద్యా సంవత్సరం 202425 గాను ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన బాలుర వసతి గృహం, కళాశాల వసతి గృహం, ఆసిఫాబాద్‌లో ప్రవేశాల కొరకు విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మెట్రిక్ వసతి గృహంలో 40 సీట్లు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో 86 సీట్లు ఉన్నాయని తెలిపారు. అర్హతగల విద్యార్థులు బాలుర వసతి గృహ సంక్షేమ అధికారిని 9441170044 లో సంప్రదించగలరని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన మోడల్ విద్యార్థులు




ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాల విద్యార్థులు అదీబా తెహీమ్, ఎం.శ్రీహర్షిత,దుర్గం విద్య ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఇంప్రూవ్ మెంట్ ద్వారా రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. సోమవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కళాశాలకు చెందిన ఎంపిసి విద్యార్థులు అదీబా తెహీమ్ 470 మార్కులకు గాను 466 మార్కులతో రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్, ఎం.శ్రీహర్షిత 461 మార్కులతో రాష్ట్ర 8వ ర్యాంకు, బైపిసి గ్రూప్ లో దుర్గం విద్య 440 కి 430 మార్కులతో 9వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. అదేవిధంగా కె. సమత 470 కి 456, అల్లె శ్రావణి 440 కి 425, సిఇసి గ్రూప్ లో ముత్యం సాత్విక 500 కి 458, పి. సాహిత్య 457 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

## సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లాకు 4వ స్థానం

ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : రాష్ట్రంలో సోమవారం విడుదలైన సప్లమెంటరీ ఫలితాల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ద్వితీయ సంవత్సరంలో 4వ స్థానం, ప్రథమ సంవత్సరంలో 14వ స్థానంలో నిలిచిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సప్లమెంటరీ పరీక్షల్లో మొదటి సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 1738 మంది హాజరు కాగా 1109 మంది ఉత్తీర్ణత సాధించారని, ఒకేషనల్ లో 201కి 128 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జనరల్ విభాగంలో 1028 మందికి 699 మంది ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ విభాగంలో 120 మందికి 73 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

## శ్రీ సాయి ఆసుపత్రిని మూసివేసి డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి ఆసుపత్రిని మూసివేసి డాక్టర్లపై చర్య తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవరావు మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఎస్‌సి కాలనీకి చెందిన ఎగిరవు హరీష్ కుమార్తె లోహిత (05) అనే చిన్నారి డాక్టర్ల నిర్లక్ష్యంతో మరణించిందని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు కేశవరావు మాదిగ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలా నిర్లక్ష్యపు వైద్యంతో చిన్నారులను పొట్టన పెట్టుకుంటున్న వైద్యులను, హాస్పిటల్ పై జిల్లా ఉన్నతాధికారులు చిన్నారి మృతి పై విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.